ప్రజాశక్తి
మంగళవారం 24 డిసెంబర్ 2024 5 శ్రీ సత్యసాయి



పోలీసుస్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

బిజెపిది రైతు వ్యతిరేక పాలన

- నూతన వ్యవసాయ మార్కెట్ చట్టం తొలగించేవరకు పోరాటం
- ఎపి రైతుసంఘం నాయకులు
- వ్యవసాయ మార్కెట్ వద్ద ఆందోళన, నాయకుల అరెస్టు
- పోలీసుల తీరుకు వ్యతిరేకంగా స్టేషన్ ఎదుట నిరసన

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

నూతన వ్యవసాయ మార్కెట్ చట్టమును తొలగించేంతవరకు మా పోరాటాలు ఆగవు అని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపలిల పెద్దన్న, ఏపీ రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నగిరి కాటమయ్య, కమతం కాటమయ్య హెచ్చరించారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ వద్ద జీవో కాపీలను దగ్ధం చేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా పోలీసులు నాయకులను బలవంతంగా అరెస్టు చేసిన టూ టౌన్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా నాయకులు పోలీసుస్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్న వ్యవసాయ రంగం, రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతులు ఆత్మహత్య చేసుకుంటూ ఉంటే కూడా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నూతన అగ్రిమెంట్ మార్కెట్ చట్టాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు వారు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను అవలంభించడం సరైన పద్ధతి కాదన్నారు. కార్పొరేట్ శక్తులకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం న్యాయం చేస్తోందని విమర్శించారు. రైతులను జైల్లో పెట్టి వారి హక్కులను కాల రాయడం సమంజసం కాదన్నారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, తక్షణమే రైతు సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. 2021 డిసెంబర్ 9న సంయుక్త కిసాన్ మోర్చా తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఎన్డీఏ 2 ప్రభుత్వం ఉల్లంఘించిందన్నారు. కొత్త జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానమనేది మూడు వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు కార్పొరేట్ ఎజెండా యొక్క వ్యూహంలో భాగమేనని వారు స్పష్టం చేశారు. రైతు సంస్థలతో చర్చలు జరిపి పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లం మహదేవ్, రామగిరి మండల రైతుల కార్యదర్శి ముత్యాలప్ప, తాడిమర్రి రైతు సంఘం మండల కార్యదర్శి పోతులయ్య, సిఐటియు జిల్లా నాయకులు ఎస్‌హెచ్ భాష, రైతు సంఘం మండల కార్యదర్శి మారుతి, సిఐటియు ధర్మవరం మండల అధ్యక్షులు జెవి. రమణ, సిఐటియు పట్టణ అధ్యక్షులు ఆదినారాయణ, ఉపాధ్యక్షులు అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార సలహా సంఘాల జాడేదీ.?

పౌరసరఫరాల్లో పెరుగుతున్న అక్రమాలు

యథేచ్ఛగా కల్తీ విక్రయాలు

అధికారుల్లో కొరవడిన పర్యవేక్షణ

ప్రజాశక్తి-హిందూపురం

తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ సక్రమంగా అందించడంతో పాటు ఎక్కడా అక్రమాలు జరగరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసింది. ఇవి ప్రతి నెల రేషన్ పంపిణీని పర్యవేక్షించాలి. అలాగే సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు చేయాలి. గత ప్రభుత్వం ఒక సారి సమావేశం ఏర్పాటు చేసి తూతూ మంత్రంగా ముగించింది. అసలు రెవిన్యూ అధికారులు ఈ సంఘాలను ఏర్పాటు చేశారా అన్న అనుమానాలు సైతం వ్యక్త మవుతున్నాయి. గత ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటి వరకు ఒక్క సమావేశం కుడా నిర్వహించ లేదు. దీంతో ఈ సంఘాలు కనుమరుగయ్యాయి. దీంతో రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. మార్కెట్‌లో సరుకుల తూకాల్లో తేడాలు, హోటళ్లలో ఆహార పదార్థాల కల్తీ మయం, చౌకధరల దుకాణాల్లో సక్రమంగా కార్డుదారులకు అందని బియ్యం ఇలా ఒకటేమిటి అనేక రూపాల్లో వినియోగదారులు మోసపోతున్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి అక్రమాలను అరికట్టేందుకు ఆహార సలహా సంఘాల దాడులు మచ్చుకైనా కనడబవు. దీంతో ప్రజాపంపిణీ వ్యవస్థపై రోజు రోజుకు ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది.

ఆహార సలహా సంఘం పనితీరు

ఆహార సలహా సంఘానికి ఛైర్మన్‌గా మండల తహశీల్దార్ వ్యవహరిస్తారు. సభ్యులుగా ఎంపిపి, జడ్‌పిటిసి, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, వినియోగదారుల సంఘాలు, వివిధ పార్టీల ప్రతినిధులు ఉంటారు. ఆహార సలహా సంఘం ప్రతి మూడు నెలలకొకసారి సమావేశమై ధరల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకుని అమలు చేయాలి. అయితే అధికారులు పట్టించుకోకుండా ఆహార సలహా సంఘాలను నిర్వీర్యం చేశారు.

రేషన్ సరుకుల్లోను కోత

గతంలో రేషన్ షాపుల్లో తెల్ల కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి బియ్యంతో పాటు కందిపప్పు, గోధుమలు, కారంపొడి, అయిల్, ఉప్పు, చింత పండు, కిరోసిన్, చక్కెర తదితర వస్తువులు పంపిణీ చేసేవారు. గత ప్రభుత్వం కార్డు దార్డుదారులకు కేవలం బియ్యం అప్పుడప్పుడు చక్కెర, బ్యాళ్లు మాత్రమే అందించారు. వీటిని సైతం పూర్తి స్థాయిలో అందించడం లేదు. రేషన్ సరుకుల పంపిణీలో కార్డుదారుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించాల్సిన ఆహార సలహా సంఘాల జాడ లేకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి అవి సక్రమంగా పని చేసే విధంగా చూడాల్సిన బాధ్యత వుంది.

అధిక ధరలకు విక్రయాలు

పలువురు వ్యాపారులు నిత్యావసర వస్తువులకు కృత్రిమకొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలను గాలికి వదిలేసి నాసిరకం సరుకులు అంటగడుతున్నారన్న ఆరోపణలు ప్రజల్లో వినపడుతున్నాయి. ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా గోదాముల నుంచి రేషన్ షాపులకు సరఫరా అవుతున్న సరుకులలో తరుగు ఉంటుందని రేషన్ డీలర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు వాపోతున్నారు. వీటి నియంత్రణకు జిల్లాలో ఎక్కడా ఆహార సలహా సంఘం కానరావడం లేదని ప్రజలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ షాపులలో డీలర్ల చేతివాటం

పట్టణం, మండల వ్యాప్తంగా కొన్ని రేషన్ షాపుల డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ప్రభుత్వం బియ్యం అప్పుడప్పుడు చక్కెర, బ్యాళ్లు మాత్రమే కార్డుదారులకు అందిస్తుంటే దీనికి డీలర్లు వ్యాపారులతో కుమ్మక్కై వీటికి తోడు అదనంగా కొన్ని సరుకులు అంటగడుతున్నారు. అవి కూడా మార్కెట్ రేట్ ప్రకారమే అందిస్తుండడంతో కార్డుదారులు లబోదిబోమంటున్నారు. కొందరు పేదలు బియ్యం తీసుకోవాలంటే మిగతా వస్తువులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొంత మంది డీలర్లు డబ్బాలతో తూకం వేస్తున్నారు. వీటిపై ఫిర్యాదులు రావడంతో తాజాగా సంచులపై సంచులు పెట్టి ఇస్తున్నారు. దీంతో ఒక తూకానికి కేజీ నుంచి రెండు కేజీల వరకు తక్కువగా వస్తున్నాయని కార్డుదారులు వాపోతున్నారు. వీటిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు మాత్రం చేపట్టలేదు.

సమావేశం నిర్వహిస్తాం

మండల స్థాయి ఆహార సలహా కమిటీ సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేస్తాం. దీనిపై సివిల్ సప్లైయి డిప్యూటి తహశీల్దార్‌తో చర్చించి, సమావేశాన్ని ఏర్పాటు చేసి, అధిక ధరలతో పాటు కల్తీ ఆహారం, హోటళ్లు,ఇతర ఆహార సమస్యలపై చర్చించి, నివేదికను జిల్లా కలెక్టర్ పంపి తగిన చర్యలు తీసుకుంటాం.

వెంకటేశు,
తహశీల్దార్, హిందూపురం

మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న జిల్లా ఎస్పీ

మైనర్లు డ్రైవింగ్ చేస్తే చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

నూతన చట్టాలను అనుసరించి మైనర్ డ్రైవింగ్ పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ వి. రత్న వెల్లడించారు. మైనర్ డ్రైవింగ్ చేస్తూ కట్టుబడిన పదిమంది మైనర్ల వివరాలను సోమవారం పట్టణంలోని డిఎస్‌పి కార్యాలయ ఆవరణంలో సేకరించారు. అందులో కొంతమంది వివిధ పాఠశాలల్లో చదువుతున్నట్లు, ఒకరు బాల కార్మికుడిగా ఉన్నట్లు గుర్తించారు. అతని వివరాలను సేకరించి, చైల్డ్ లేబర్ పై కేసు నమోదు చేయాలని సిఐకు సూచించారు. అనంతరం మైనర్ డ్రైవింగ్ చేస్తున్న చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. రోడ్డు భద్రత నిబంధనలను అనుసరించి మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరం అన్నారు. ఇకపై పట్టుబడితే తల్లిదండ్రుల మీద కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. నేరాలను అదుపు చేయడానికి కోసం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా నాలుగు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నామన్నారు. ఈ డ్రోన్ కెమెరాలను సెలవు రోజుల్లో ఎక్కువగా వినియోగించి నేరాల పర్యవేక్షణ చేపట్టామన్నారు. హిందూపురం డివిజన్ వ్యాప్తంగా జనవరి నెలలోపు అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నిత్యం పర్యవేక్షణ చేయడానికి కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి మహేష్, సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బకాయి నిధులు విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు బకాయి ఉన్న ఫీ రీయింబర్స్ మెంట్, వసతి దీవెన నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులకు సంబంధించి నాలుగు క్వార్టర్ల రూపంలో డబ్బులు జమ అయ్యేవని, గత సంవత్సరం విద్యార్థులకు కేవలం ఒక క్వార్టర్ మాత్రమే విడుదల కాగా మిగిలిన నిధులు ఇప్పటివరకు విడుదల కాలేదని అన్నారు. మూడు క్వార్టర్ల నిధులు దాదాపు రూ.2100 కోట్లు విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయంబర్స్ మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదల కాకపోవటంతో సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ , వసతి దీవెన నిధులను విడుదల చేసి విద్యార్థుల కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో హామీ ఇచ్చిన మేరకు జీఓ నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దిలీప్, మంజునాథ్, దర్శన్, గోవిందు, తిప్పేష్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ వెంకటేశుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజా వినతులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకుకోవాలని కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ అర్జీదారులతో అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్‌ఒ విజయసారధి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డిపిఒ సమత, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గృహ నిర్మాణ శాఖ పీడీ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలతో పాటు ప్రభుత్వ పథకాల అమలుపై కూడా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హెచ్‌ఒడిలు తమ శాఖల పరిధిలో డివిజన్, మండల స్థాయి సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అర్జీ దారుని సమస్య పరిష్కారమైతే పరిష్కారం అయినట్లు ఫోన్ ద్వారా తెలపాలన్నారు. ఒకవేళ పరిష్కారం కాకుంటే వాటికి తగిన కారణాలు అర్జీదారులకు వివరించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై కూడా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఐపి పీడీ సుదర్శన్, ల్యాండ్ సర్వే ఏడీ విజయశాంతి బాయి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, డిఎంహెచ్‌ఒ మంజువాణి, పశుసంవర్ధక శాఖ జేడీ శుభచంద్ర, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు, వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థికపరమైన వినతులు మినహా మిగతా అన్నింటినీ పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా,డివిజన్,మండల స్థాయి నుంచి వచ్చే వినతుల్లో ఆర్థికపరమైన వినతులు తప్ప మిగతా వినతులకు సరైన పరిష్కారం చూపాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలోని ఆయా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డిఒ విజయసారథి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, అధికంగా పెనుగొండ డివిజన్లో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని అన్నారు. వాటిని పరిష్కరించే బాధ్యత అక్కడ రెవెన్యూ సిబ్బందిపై ఉందన్నారు.

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న వృద్ధుడు

నిర్లక్ష్యం వహించే అధికారులపై తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పరిష్కరించే వరకు ఫాలో చేయాలన్నారు. రీ సర్వే ,అన్ని మున్సిపాలిటీలలో రైతు బజార్లు ఏర్పాటు, లోకాయుక్త కేసులు, ఎస్సీ, ఎస్టీ మహిళ శాఖ కమిషన్ నుంచి వచ్చే వినతుల అంశాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. సోమవారం అర్జీలు ఇచ్చేవారికి ప్రత్యేకంగా కుర్చీలు, నీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి-హిందూపురం



పోటీల విజేతలతో జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. ఇటీవల మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్.డి.జి.ఎస్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం అదనపు జిల్లా జడ్జి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలలో జరిగిన సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ చదువు మానవ మనుగడకు ఎంతో ప్రధానమన్నారు. ఉద్యోగం కోసమే కాకుండా విలువల కోసం విద్యను నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా ప్రతి విద్యార్థి చట్టాలపై కనీస స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎస్‌డిజిఎస్ కళాశాలలో విజేతలుగా నిలిచిన షమీం తాజ్, నందిని, హేమలత, పావని, ముబారక్, అంజలీలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా పాలిటెక్నిక్ కళాశాలలో విజేతలుగా నిలిచిన మానస, జయలక్ష్మి, లావణ్య, బిందు, పూజిత, పల్లవికి బహుమతులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, కళావతి, సంతోషి కుమారి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ హరీష్ బాబు, ఆయా కళాశాల అధ్యాపకులు అనిల్, పద్మజ, హిమబిందు, లోక్ అదాలత్ సిబ్బంది శారద తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి దేశ ఆర్థిక అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని వక్తలు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్‌డిజిఎస్ ఎంబీఏ కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఎంబీఏ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ నాగేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల కమిటీ కార్యదర్శి బైసాని రాంప్రసాద్ పాల్గొని మాట్లాడారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ దేశ ఆర్థిక స్థితిని బలపరిచే వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జెఎస్‌విఎస్ ప్రసాద్, వాసవి విన్నర్స్ ప్రిన్సిపల్ కాంతిరేఖ, హెచ్‌ఒడి అనిల్‌కుమార్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-హిందూపురం

కెవిపిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కెపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమాన పరుస్తూ, అహంకర పూరితంగా అమిత్‌షా మాట్లాడారన్నారు. దీనిపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసమావేశానికి దళిత, గిరిజన సంఘాలతో పాటు అన్ని ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

మత విద్వేషాలకు పాల్పడితే సహించం : ఎమ్మెల్యే కందికుంట



ఎమ్మెల్యే కందికుంటను సన్మానిస్తున్న ఇమామ్, మౌజన్లు

ప్రజాశక్తి - కదిరిటౌన్

కదిరి నియోజకవర్గం అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని ఎవరిపైనా ఏ వర్గం పైన తమకు కక్ష సాధింపు లేవని కులం మతం పేరుతో రాజకీయాలు చేసి మత విద్వేషాలు రెచ్చగొడితే అలాంటి వారిని ఉపేక్షించే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ స్పష్టం చేశారు. ఇమామ్, మౌజాన్లకు గౌరవ వేతనం పెంపుచేస్తు జీవో విడుదల చేసిన నేపథ్యంలో సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌ను ఇమామ్, మౌజాన్లు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ 20 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్న తనకు ఇక్కడి పరిస్థితులపై అవగాహన ఉందన్నారు. భావితరాల భవిష్యత్తు, ప్రాంత అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని స్పష్టం చేశారు .ఏ వర్గం పైన ఏ కులం పైన తనకు కక్ష సాధింపు లేవని అన్నారు. గత ప్రభుత్వం హయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూములు, క్రిస్టియన్ మిషనరీ ఆస్తులు కొల్లగొట్టారని విమర్శించారు. అదేవిధంగా ఇండస్ట్రియల్ ఏరియాలో ఎపిఐఐసి ద్వారా పరిశ్రమల కోసం భూమి కేటాయిస్తే ఆ స్థలంలో ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నారని అన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటే ఓవర్గంపై ఎమ్మెల్యే రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనికొందరు పని కట్టుకొని వారి స్వలాభం కోసం కులం మతం రంగు నులిమి తనపై ప్రజలలో అపోహలు సృష్టించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్న తాను అన్ని ఒడిదిడుకులు ఎదుర్కొన్నానని ఇలాంటి వాటికి బెదిరే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. మత విదేశాలు రెచ్చగొట్టే వారిని ఉపేక్షించే ప్రసక్తి లేదని వారిపై రాబోయే రోజులలో చర్యలు తప్పవని హెచ్చరించారు. భూములు కొల్లగొట్టడంలో ఫోర్జరీ చేయడంలో ఆరితేరిన కొందరు నాయకులు ఇప్పటికే జైలు పాలయ్యారని. ఆ భూములు కొల్లగొట్టడంలో కొందరు రెవిన్యూ లో అధికారులు హస్తం ఉందని అలాంటి అధికారులు సైతం త్వరలో జైలుకు వెల్లక తప్పదని అన్నారు.

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

టిడిపితోనే మైనార్టీల అభివృద్ధి

టిడిపి హయాంలోనే ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం అమలు చేశామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. త్వరలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఇమామ్, మౌజాన్లకు పక్కాఇళ్లుమంజూరు చేస్తామన్నారు.. మైనార్టీ లోని పేదల పిల్లల పెళ్లిళ్ల కోసం గతంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సొంత నిధులతో మైనార్టీలకు కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇచ్చామని చెప్పారు. నియోజకవర్గ ప్రజలందరూ తనకు సమానమన్నారు. ఈ కార్యక్రంలో ఇమామ్ మౌజన్ కౌన్సిల్ సభ్యులు కదిరి హెరిడిటి ప్రభుత్వ ఖాజీ ఆన్సర్ బాషా, ఖాజీ మన్నాన్, హాఫిజ్ అక్రమ్, హాఫిజ్ షకీల్, కదిరి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్‌తో పాటు ఇమామ్,మౌజన్లు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలోనే రవాణా శాఖ సేవలు

మార్కెట్‌యార్డ్‌లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించిన మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఈ ప్రాంత ప్రజలకు రవాణా శాఖ సేవలను మరింత చేరువ చేయాలన్న ధ్యేయంతో పట్టణం లోని మార్కెట్ యార్డ్ ప్రాంతంలో రవాణా శాఖ విభాగం ఏర్పాటు చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో రవాణా శాఖ ఏర్పాటుచేసిన ఆన్‌లైన్ సేవలను సోమవారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ వాహనాలకు సంబంధించి లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఎల్‌ఎల్‌ఆర్, ఫిట్‌నెస్, పర్మిట్లు, తదితర సేవలు అందిస్తారన్నారు. రాబోయే రోజుల్లో శాశ్వత రవాణా శాఖ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు ఆర్డీవో, రవాణా శాఖ అధికారి ద్వారా భూసేకరణకు సంబంధించి ప్రతిపాదన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బత్తలపల్లి, తాడిమర్రి, ధర్మవరంతో పాటు రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి, సికె.పల్లి, కనగానపల్లి మండల ప్రజలకు రవాణా శాఖ సేవలు అందిస్తారన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తెస్తుం దని తెలిపారు. జిల్లా రవాణా శాఖ అధికారి కరుణసాగర్, కదిరి, ధర్మవరం ఎంవిఐలు వరప్రసాద్, రాణి, ఆర్డీవో మహేష్, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ యాదవ్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

'స్వచ్ఛ ధర్మవరమే' లక్ష్యం : మంత్రి

ధర్మవరంను అతి సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఇందులో ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఉదార భావం కలిగిన వారందరూ భాగస్వాములు కావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో రూ. 2.23 కోట్లతో నూతన డంప్ యార్డ్ నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేసి మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మున్సిపాలిటీకి సంబంధించిన వర్మి కంపోస్టు 8 ఏళ్లుగా నిరుపయోగంగా ఉందన్నారు. దీంతో మరమ్మతులు పూర్తిచేసి పునః ప్రారంభించా మన్నారు. తద్వారా మున్సిపాలిటీకి 90 రోజులకు 40 టన్నుల దాకా సేంద్రియ ఎరువుతో పాటు ఏడాదికి రూ. 14 లక్షలు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పట్టణంలో రోజుకు 73 టన్నుల చెత్త ఉత్పత్తి జరుగుతుందన్నారు. సమిష్టి కృషితో ధర్మవరం పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కషి చేస్తామన్నారు. జన వికాస్ యోజన, అమృత్, తదితర పథకాల అమలుతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. మంత్రి వెంట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఉన్నారు.

మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న మంత్రి

మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బడ్జెట్ ప్రత్యేక సమావేశంలో ఛైర్‌పర్సన్ కాచర్ల శ్రీలక్ష్మితో కలిసి మంత్రి పాల్గొన్నారు. అజెండా మేరకు 2024-25కు సంబంధించి సవరించిన బడ్జెట్ అంచనాలు, 2025-26 కోసం తయారు చేయబడిన బడ్జెట్ అంచనాలను మంత్రి, కౌన్సిల్ సభ్యుల ఆధ్వర్యంలో ఆమోదించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు వారు యూని ఫామ్ పంపిణీ చేశారు. సమావేశంలో కమిషనర్ ప్రమోద్ కుమార్, మేనేజర్ రాజేశ్వరీబాయి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్‌ను వేధిస్తున్న వారిని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని ఊటుకూరు పిహెచ్‌సిలో పని చేస్తున్న ఆశా వర్కర్ గీతమ్మను వేధింపులకు గురిచేస్తున్న ఎఎన్ఎం తేజవతి, ఎంఎల్‌హెచ్‌పి కవితలను సస్పెండ్ చేయాలని కోరుతూ సోమవారం ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ హసీనా సుల్తానాకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రజలు, గర్భిణులకు సేవలందిస్తున్న ఆశాలకు అధికారులు రక్షణగా ఉండాల్సింది పోయి మానసిక ఆవేదనకు గురి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలను సస్పెండ్ చేయాలని, లేనిచో మండలంలోని ఆశాలందరూ విధులు బహిష్కరించి తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షులు సాంబశివ, జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, మండల కన్వీనర్ శివకుమార్, నాయకులు కిరణ్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, సహాయ కార్యదర్శి రాధమ్మ, జిల్లా కమిటీ సభ్యులు వరలక్ష్మి, అనిత, మండలంలోని ఆశాలు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పి ఆత్మహత్యాయత్నం

ఆశా వర్కర్స్ యూనియన్ చేపట్టిన ధర్నాతో మానసిక మనోవేదనకు గురైన ఎంఎల్‌హెచ్‌పి తేజవతి ఆసుపత్రిలో ఆత్మహత్యాయత్నానికి యత్నించింది.

తహశీల్దార్ హసీనా సుల్తానాకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

దోమల నివారణకు వాడే ద్రావకం తాగింది. డాక్టర్లు గమనించి ఆమెకు చికిత్స చేశారు. ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చర్చలు సఫలం

ఈ సంఘటనలను తీవ్రంగా పరిగణించిన తహశీల్దార్ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, డాక్టర్లు, సిబ్బందితో సమావేశమై చర్చించారు. ఉద్యోగులు వారికి కేటాయించిన విధులను తప్పక నిర్వర్తించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పిహెచ్‌సి వైద్యులు ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలన్నారు. ముమ్మందు ఎంఎల్‌హెచ్‌పి, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు కలిసికట్టుగా పని చేసుకోవాలని సూచించారు. చర్చల ద్వారా సమస్య పరిష్కారమైనట్లు ఆశా వర్కర్ల యూనియన్ సభ్యులు తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తలుపుల

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు మండలానికి చేరడంతో సోమవారం కోరుగుట్టపల్లి వద్ద ఎమ్మెల్యే హంద్రీనీవా కాలువలో జల హారతి ఇచ్చారు. అనంతరం ఎన్టీఆర్, సిఎం చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, సంబంధిత మంత్రుల చొరవతో హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు తీసుకొచ్చి ఏళ్లుగా ఎదురుచూస్తున్న తలుపుల, ఎన్‌పి.కుంట రైతుల కల సాకారం చేశామన్నారు. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్యను

హంద్రీనీవా కాలువలో జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే కందికుంట

పరిష్కరిస్తా మని, మేజర్ గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ముబారక్, ప్రధాన కార్యదర్శి జయచంద్ర, కొమ్మెర శ్రీనివాసులు, ఓబుల్‌రెడ్డి, శంకర, కృష్ణ, హరి, కొండారెడ్డి, దేరంగుల గంగరాజు, శ్రీశైలం రమణ, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-2025 క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడటంలో 'ప్రజాశక్తి' దినపత్రిక ఎప్పుడూ ముందుంటుం దని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ప్రజాశక్తి ప్రచురించిన 2025 నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కందికుంట ఆవిష్కరించారు. కార్యక్రమం లో ప్రజాశక్తి సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, తెలుగు యువత నాయకులు కావడి ప్రవీణ్‌కుమార్, పాత్రికేయులు హరి, నాగేష్, మైనార్టీ నాయకులు అయూబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై వ్యకాసం ఫిర్యాదు

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు రాజకీయ, పలుకుబడిన కలిగిన వ్యక్తులు కబ్జా చేసి అందులో నిర్మాణాలు చేపట్టాలరని, వారిపై చట్టపరంగా కఠిక చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో తహశీల్దార్ మారుతికి వినతి పత్రం ఇచ్చారు. పెద్దన్న మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో అధికారులు నోటీసు బోర్డులు కొందరు ఆక్రమించుకున్నారన్నారు. ఆ స్థలంలో ఇల్లు లేని పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహశీల్దార్ మారుతి ఈ స్థలం

తహశీల్దార్ మారుతికి ఫిర్యాదు చేస్తున్న వ్యకాసం నాయకులు

విషయం హైకోర్టులో ఉందని, కబ్జాకు గురి కాకుండా కట్టడి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు ముత్యాలప్ప, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యురాలు స్వర్ణలత, స్థలాల సాధన కమిటీ సభ్యులు అంజలి, ఆంజనేయులు, ప్రతాప్, రామాంజనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పది, ఇంటర్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించండి

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం మార్చి-2025లో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు జనవరి 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని డిఇఒ జి.కృష్ణప్ప, జిల్లా వృత్తి విద్యాధికారి లాజర్ తెలిపారు. ఈ నెల 23 నుంచి 31వ తేదీ వరకూ అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చన్నారు. జనవరి 1 నుంచి 4వ తేదీ వరకూ రూ. 25 అపరాధ రుసుము, 5 నుంచి 8వ తేదీ వరకూ రూ. 50, 9, 10 తేదీల్లో తాత్కాలిక రుసుము చెల్లించవచ్చు అన్నారు. ఇంటర్‌కు రూ. 1000, పదో తరగతికి రూ. 500తో పాటు ఆయా సబ్జెక్టులకు నిర్దేశించిన పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కూటమి ప్రభుత్వం ప్రజలు మెచ్చే విధంగా పాలన సాగిస్తోందని, అందుకే ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరుతున్నారని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. మండలంలోని ఉప్పునేసినపల్లి పంచాయతీలోని గరుడంపల్లి గ్రామానికి పలువురు వైసిపి నాయకులు సోమవారం అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన వార్డు మెంబర్ సాకే నాగరాజు, నరసింహులుతో పాటు 15 కుటుంబాలు టిడిపిలో

టిడిపిలోకి చేరిన వారితో పరిటాల శ్రీరామ్

చేరగా పరిటాల శ్రీరామ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. శ్రీరామ్ మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన ప్రధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతలపల్లి మహేష్‌చౌదరి, చిగిచెర్ల రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారిణులతో ఉపాధ్యాయులు

ఫుట్‌బాల్ పోటీల విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-లేపాక్షి

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫుట్‌బాల్ క్లబ్ జట్లకు ఆర్‌డిటి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో లేపాక్షి ఫుట్‌బాల్ క్లబ్ జట్టు విజయం సాధించి జిల్లా ఛాంపియన్‌గా నిలిచారు. అండర్-12 జట్టులో స్థానిక ఓరియంటల్ పాఠశాల విద్యార్థినులు గ్రీష్మ, సంహిత, శ్వేత, హరిణి, లాస్య, అండర్-16 జట్టులో రేఖ, పూజిత, ప్రణతిలతో పాటు పులమితి జడ్పీ హైస్కూల్ విద్యార్థినులతో కలిసి పాల్గొని రెండు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. వీరిని హెచ్‌ఎం వివిసి.గిరి, సుబ్బారావు, వ్యాయామ ఉపాధ్యాయులు రామాంజనేయులు, సురేష్ ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

యుటిఎఫ్ 'పది' మోడల్ పేపర్లు అందజేత

ప్రజాశక్తి-రొద్దం

పదో తరగతి విద్యార్థుల కోసం యుటిఎఫ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన మోడల్ పేపర్లను సోమవారం మండలంలోని కోగిర జడ్పీ హైస్కూల్‌లో ఆవిష్కరించారు. అలాగే కంబాలపల్లి ఎంపియుపి పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్ గోవిందప్ప సహకారంతో 50 మంది విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎస్‌ఎంసి ఛైర్మన్ గోవిందప్ప మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో మండలాన్ని మొదటి

యుటిఎఫ్ మోడల్ పేపర్లు అందజేస్తున్న గోవిందప్ప

స్థానంలో ఉంచాలని కోరారు. యుటిఎఫ్ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ నినాదంతో ముందుకెళ్తుందని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు సానిపల్లి గంగాధర్, పోతులయ్య, నరసింహప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని సరస్వతీ విద్యామందిర్ సమీపంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ముస్లిం మైనార్టీ నేత, సామాజిక సేవాకర్త ఉమర్‌ఖాన్ అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపి పార్థసారథి హాజరై మాలధారులకు భోజనం వడ్డించారు. అంతకుముందు ఎంపికి అయ్యప్ప మాలధారుల గురువులు స్వాగతం పలికారు. ఎంపి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి రూ. 10 లక్షల



అయ్యప్ప మాలధారుల అన్నదానంలో పాల్గొన్న ఎంపి

ఎంపి నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఆయన వెంట పార్లమెంటు కార్యదర్శి నరసింహులు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి అశ్వత్థరెడ్డి, శ్రీనివాసులు, మల్లికార్జున, మణిశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ వ్యవసాయ వర్శిటీ వజ్రోత్సవంలో రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకలకు సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన విశ్వవిద్యాలయం విసి జానయ్య, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులకు వజ్రోత్సవ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ వ్యవసాయ దినోత్సవం రోజున వ్యవసాయ విద్యార్థుల మధ్య గడపడం చాలా సంతోషంగా ఉందని రఘువీరా తెలిపారు.



తెలంగాణలోని వ్యవసాయ వర్శిటీ వజ్రోత్సవంలో పాల్గొన్న రఘువీరారెడ్డి

పాఠశాలల్లో ఆయాల సమస్యలపై మంత్రికి వినతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న కంటెంజెంట్ ఆయాలు సోమవారం సిఐటి యు ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో 30 ఏళ్లుగా పని చేస్తున్న ఆయాలకు చాలీచాలని వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో వారికి కుటుంబాల పోషణ భారమైందన్నారు. ఇకనైనా వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ. 10వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చౌడమ్మ, జయమ్మ, కార్మికులు ప్రమీల, నాగలక్ష్మి, గంగరత్న, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆయాలు

మొక్కజొన్న తూకాల్లో మోసం.. కేసు నమోదు

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన మొక్కజొన్న దళారీ ఎలక్ట్రానిక్ తూకం మిషన్ ద్వారా రైతు నుంచి మొక్కజొన్న దిగుబడి కొనుగోలులో మోసం చేయగా రైతు గమనించి అధికారులకు అప్పజెప్పాడు. వివరాలు.. పరిగి గ్రామానికి చెందిన రైతు రాజేష్‌రెడ్డి తన పొలంలో పండించిన మొక్కజొన్న దిగుబడిని అమ్మకానికి పెట్టాడు. దళారీ గోపాల్ ఎలక్ట్రానిక్ తూకం మిషన్ తీసుకొచ్చి ఒక్కో బ్యాగులో 7 నుంచి 8 కిలోలు తక్కువ చూపిస్తూ రైతును మోసం చేశాడు. ఇది గమనించిన రైతు సమాచారం ఇవ్వడంతో తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ శివశంకర్ అక్కడికి చేరుకుని దళారీ గోపాల్ రైతును చేస్తున్న మోసాలను గుర్తించి

దళారీపై ఫిర్యాదు చేస్తున్న రైతులు

కేసు నమోదు చేశారు. ఈ సంఘటనతో గతంలో మోసపోయిన రైతులు స్టేషన్‌కు క్యూ కట్టారు. ఇలాంటి దళారుల వల్ల మొక్కజొన్న రైతులు నష్టపోతున్నారని తూనికలు కొలతల అధికారులు ఎప్పటికప్పుడు దళారులపై దృష్టి పెట్టాలని రైతు సంఘం నాయకుడు వెంకట్రామిరెడ్డి ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌ను కోరారు.

వక్కతోటలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్

రూ. 5 లక్షలు నష్టం

ప్రజాశక్తి-మడకశిర

అమరాపురం మండలంలోని ఉప్పార్లపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు జుంజమ్మ వక్క తోటలో సోమవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకుని దాదాపు రూ. 5లక్షల ఆస్తి నష్టం జరిగింది. వివరాలు.. జుంజమ్మ అప్పు చేసి రెండెకరాల్లో మూడేళ్ల క్రితం 1,400 వక్క చెట్లు పెట్టింది. తోటలోని విద్యుత్ వైర్లను మార్చాలని ఆమె ఆ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా నిర్లక్ష్యం వహించడంతోనే అగ్ని ప్రమాదం జరిగి వక్క చెట్లు కాలి బూడిదయ్యాయని బాధితురాలు వాపోయింది. 1000 చెట్లు కాలిపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత మహిళా రైతు కోరింది.

ఎస్‌కెయు క్రికెట్ జట్టుకు 'బ్లూమూన్' విద్యార్థులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు రూరల్ మండలంలోని బ్లూమూన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సాయిప్రణీత్, వెంకటసాయి ఎంపికయ్యారని కళాశాల ఛైర్మన్ ఎం.శివశంకర్, పిడి రాఘ వేంద్రరెడ్డి తెలిపారు. యూనివర్సిటీ అనుబంధ కళాశాలల క్రికెట్ పోటీల్లో డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థి సాయిప్రణీత్ 2 శతకాలు, థర్డ్ ఇయర్ డిగ్రీ విద్యార్థి వెంకటసాయి 2 అర్థ సెంచరీలతో పాటు బౌలింగ్‌లో రాణించారు. వీరు జనవరిలో చెన్నైలో జరిగే అంతర్ యూనివర్సిటీల పోటీల్లో ఎస్కేయు జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అలాగే యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పోటీల్లో వరుస

కళాశాల ఛైర్మన్‌కు ట్రోఫీ అందజేస్తున్న క్రీడాకారులు

విజయాలతో రాణించి రన్నర్‌గా నిలిచిన బ్లూ మూన్ డిగ్రీ కళాశాల జట్టు క్రీడాకారులను విద్యాసంస్థల అధినేత ఎం.శివశంకర్ అభినందిం చారు. అంతకు ముందు జట్టు సభ్యులు రన్నర్స్ ట్రోఫీని ఛైర్మన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గోరంట్ల స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-గోరంట్ల

స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఎస్పీ వి.రత్న సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా మందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అందులో భాగంగా వాహనదారులకు ప్రమాదాలపై, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ వెంట సిఐ శేఖర్ ఉన్నారు.

జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకుందాం

ప్రజాశక్తి-హిందూపురం

అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు మల్లికార్జున కుటుంబాన్ని ఆదుకోవడం అందరి బాధ్యత అని సీనియర్ జర్నలిస్టులు పేర్కొన్నారు. జర్నలిస్టు కుటుంబానికి అందజేయాలని కోరుతూ హిందూపురం నియోజకవర్గ వైసీపీ నాయకులు వేణురెడ్డి తన కార్యాలయంలో రూ. 10 వేలను పాత్రికేయులకు అందించారు. అదేవిధంగా వాసవి క్లబ్ నిర్వాహకులు రూ. 5 వేలు అందించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ పట్టణంలో ఉన్న పాత్రికేయులు అందరూ కలిసి రూ. 47 వేలు అందించారని, వీరితో పాటు ప్రెస్ క్లబ్ ఖాతా నుంచి రూ. 20 వేలు, టిడిపి కార్యాలయం నుంచి రూ. 10

పాత్రికేయులకు ఆర్థిక సహాయం అందిస్తున్న వేణురెడ్డి

వేలు, లేపాక్షి ఆలయ అధ్యక్షులు రమానంద స్వామి రూ. 5 వేలు, పాంచజన్య శ్రీనివాసులు రూ. 5 వేలు అందించారన్నారు. మొత్తం రూ. 1.02 లక్షలు మల్లికార్జున కుటుంబాన్ని కలిసి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కమిటీ నిర్వాహకులతో పాటు వివిధ పత్రికల్లో, చానల్లో పనిచేస్తున్న పాత్రికేయులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రిని కలిసిన విప్ కాలవ, గుండుమల

రైల్వే మంత్రిని కలిసిన విప్ కాలవ, గుండుమల

ప్రజాశక్తి-మడకశిర రూరల్

కర్నాటకలోని తుమకూరులో సోమవారం కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను ఆయన నివాసంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మంత్రితో మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం మంజూరైన రాయదుర్గం-తుమకూరు రైల్వే లైన్ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయని, ఈ లైన్‌ను త్వరగా పూర్తి చేయాలని కోరారు. స్పందించిన మంత్రి ఏడాది లోపు ఈ రైల్వే లైన్ పూర్తి చేసేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు.

రేషన్ షాపుల్లో త్రాసులకు సీల్ ఏర్పాటు

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం మండలంలోని 35 రేషన్‌షాపులకు సంబంధించిన ఎలక్ట్రానిక్ తూనికలు కొలతల పరికరాలకు హిందూపురం తూనికల శాఖ అధికారి ఇన్‌స్పెక్టర్ శివకుమార్ చెక్ చేసి సీల్ చేశారు. అలాగే వాటిలో వున్న తేడాలను గుర్తించి ఆ తేడాలను డీలర్లకు చూపించారు. ఆ లోపాలను సరి చేసి వాటికి రాజ ముద్ర వేశారు. తూనికల శాఖ వారు ఇచ్చిన సర్టిఫికెట్‌ను రేషన్ షాపులో ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగేంద్ర, సిఎస్‌డిటి హనుమంతు, సివిల్ సప్లై డేటా ఎంట్రీ ఆపరేటర్ బి.అశోక్‌రెడ్డి, తూనికలు, కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, డీలర్ల సంఘ అధ్యక్షులు సిద్దన్న, మండల డీలర్లు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ మిషన్‌కు సీల్ వేస్తున్న అధికారి

తైక్వాండో పోటీల్లో హర్షవర్ధని ప్రతిభ

ప్రజాశక్తి-అమడగూరు

మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇడగొట్టు మంజునాథ్, రోజా దంపతుల కుమార్తె హర్షవర్ధని తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటింది. తాడిపత్రిలో సోమవారం జరిగిన 135 సెం.మీ. 44 కిలోల విభాగంలో హర్షవర్ధని ప్రథమ స్థానం సాధించింది.

హర్షవర్ధని అనంతపురంలోని గ్లోబల్ ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతోంది. పాఠశాలలో ఉపాధ్యాయులు రామాంజులు నాయక్, హరి శిక్షణ ఇవ్వడంతో హర్షవర్ధని క్రీడా పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిందని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

చెట్లను నరికే విషసంస్కృతి మంచిది కాదు : చిలకం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ప్రశాంతంగా ఉండే గ్రామాల్లో పచ్చని చీని చెట్లను నరికే విష సంస్కృతి మంచిది కాదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి సూచించారు. మండలంలోని తంబాపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త రమణారెడ్డి తోటలోని 32 చీని చెట్లను గుర్తు తెలియని వ్యక్తుఉలు ఆదివారం రాత్రి నరికి వేశారు. విషయం తెలుసుకున్న చిలకం సోమవారం ఆ గ్రామం వెళ్లి రమణారెడ్డిని పరామర్శించి నరికివేసిన చీని చెట్లను పరిశీలించారు. చిలకం మాట్లాడుతూ 2 నెలల క్రితం ఇదే రమణారెడ్డి తోటలో 43 చీని చెట్లను నరికి వేశారని ఇలా చెట్లను నరికివేసే సంస్కృతి మంచి పద్ధతి కాదన్నారు. చెట్లను నరికిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని సిఐ ప్రభాకర్‌ని కోరారు. అనంతరం రమణారెడ్డి ఇంటికి వెళ్లి జనసేన పార్టీ, నేను అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

చోరీ కేసుల్లో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాల్లో జరిగిన చోరీ కేసులకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుండి రూ.15.20 లక్షల విలువ చేసే 197 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు శ్రీ సత్యసాయి ఎస్పీ వి.రత్న పేర్కొన్నారు. సోమవారం ఆయా చోరీ కేసులకు సంబంధించిన వివరాలను స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ మహేష్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వెల్లడించారు. హిందూపురం పట్టణంతో పాటు రూరల్ మండలంలోని పలు ప్రాంతంలో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని నిందితులు చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ చోరీలకు పాల్పడిన హిందూపురం పట్టణంలోని రహమత్ పురానికి చెందిన ఎస్ అల్లా బకాష్, సయ్యద్ నూరుల్లా, హిందూపురం రూరల్ మండలం తూముకుంట చెక్ పోస్ట్‌కు చెందిన భువనేశ్వరిని అరెస్టు చేశారన్నారు. అయితే చోరీ కేసు లకు సంబంధించి మరో ముగ్గురు ఎరికాల కావడి నాగేంద్ర

రికవరీ చేసిన ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ వి.రత్న

అలియాస్ నాగ అలియాస్ రోబో, సాకే ప్రవీణ్ కుమార్ అలియాస్ కాలా, చాకలి శ్రీనాథ్ అలియాస్ శ్రీనివాసులును అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

డీఎస్పీ, సిఐలను అభినందించిన ఎస్పీ

హిందూపురం పట్టణ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న చోరీలపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులను అరెస్టు చేయడంతో పాటు వారి నుండి బంగారు ఆభరణాలను రికవరీ చేయడంలో కీలక పాత్ర వహించిన హిందూపురం డిఎస్‌పి మహేష్‌తో పాటు సిఐలు అబ్దుల్ కరీం, ఆంజనేయులు, తదితర సిబ్బందిని ఎస్పీ వి. రత్న అభినందించారు. రివార్డు నిమిత్తం వీరిని ఎంపిక చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

కార్యకర్త కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని తంబాపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఎరుకల శివను ఆదివారం పోలీసుల అరెస్టు చేశారు. ఈ విషయం తెలిసి రాత్రి 11:30 గంటలకు నియోజకవర్గ టిఇపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ స్టేషన్‌కు వచ్చి సిఐ ప్రభాకర్‌తో చర్చించారు. ఏ విషయంలో అరెస్టు చేశారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై ఎరుకల శివను పోలీస్ స్టేషన్ నుంచి విడుదల చేయించారు. పరిటాల శ్రీరామ్ వెంట టిడిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి సురేందర్‌నాయుడు, అయ్యప్ప ఉన్నారు.

డిడిలు చెల్లించినా అందని ట్రాన్స్‌ఫార్మర్లు

ఇబ్బందుల్లో రైతులు

ప్రజాశక్తి-అగళి

మండలంలో పలువురు రైతులు డిడిలు కట్టి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రయివేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసి లక్షల రూపాయల మేరకు డిడిలు తీసి విద్యుత్ శాఖ అధికా రులకు చెల్లించి ఏడాదైనా ఇంతవరకూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేయలేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై ఇప్పటివరకూ ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ స్పందించలేద న్నారు. విధి లేని పరిస్థితుల్లో పక్క పొలాల్లోని రైతుల బోర్ల నుంచి నీటిని వాడుకుని పండ్లు, వక్క, టెంకాయ తోటలను కాపాడుకుంటున్నామని వాపోతున్నారు. ఎండా కాలంలో ఆయా తోటలకు నీటి సమస్య తీవ్రం అయ్యే ప్రమాదం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డిడి కట్టిన ప్రతి రైతుకూ వరుస క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విశాల ఫెర్రర్‌కు సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

అవార్డు అందుకుంటున్న విశాలఫెర్రర్

ఆర్‌డిటి సంస్థ మహిళా విభాగం డైరెక్టర్ విశాలఫెర్రర్‌కు బెంగళూరులో సౌత్ ఇండియా ఉమెన్ అచీవర్స్ అవార్డ్-2024 అవార్డు అందజేశారు. సామాజిక సేవలో విశాల ఫెర్రర్ అందిస్తున్న సేవలను గుర్తించి స్వా సంస్థ సిఇఒ రాధ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా విశాలఫెర్రర్ మాట్లాడుతూ మహిళ అభ్యున్నతికి కృషి చేసినందుకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ట్రాన్స్కో విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాథ్‌చౌదరి, రవికాంత్ క్యాటరర్స్ రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో నిర్వహిస్తున్న అధికారులు

కల్లూరులో రెవెన్యూ గ్రామసదస్సు

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని కల్లూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆమె మాట్లా డుతూ ప్రజల సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం ప్రజల వద్దకే అధికారులను పంపుతుందన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యలపై అర్జీలు ఇస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. సదస్సులో పంచాయతీ కార్యదర్శి లక్ష్మయ్య, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రమీలమ్మ, విఆర్ఒ అంకిత, మాజీ జడ్పీటీసీ రామాంజనమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయానికి మైక్ సెట్ అందజేత

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి సోమవారం టిడిపి నాయకులు రూ. 16 వేల విలువ చేసే మైక్ సెట్ పరికరాలను అందజేసినట్లు తహశీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కుమార్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, నాయకులు సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు

విద్యార్థులకు యుటిఎఫ్ మెటీరియల్‌ను అందజేసిన డివైఈవో

ఇంటర్ విద్యార్థులు మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని డివైఈవో రఘునాథరెడ్డి సూచించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రభుత్వం అందజేసిన మెటీరియల్‌ను సోమవారం స్థానిక సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల కు అందజేశారు. డివైఈవో మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతిర్‌లత, అధ్యాపకులు రవీందర్‌రెడ్డి, చంద్రమౌళి, నారాయణస్వామి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని ఆపాలని ఆర్డీవోకు వినతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

స్థానిక శ్రీచౌడేశ్వరి కాలనీ(నక్కలగుట్ట)లో రోడ్డుకు అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ సోమవారం పెనుకొండ ఆర్డీవోకు వినతి పత్రం అందజ ేశారు. వారు మాట్లాడుతూ స్థానిక చౌడేశ్వరీ కాలనీలో వైసిపి నాయకుడు గత వైసిపి ప్రభుత్వ కాలంలో అధికా రం అడ్డుపెట్టుకొని అక్రమంగా స్థలాన్ని కాజేసి రోడ్డుకు అడ్డంగా ఇంటి నిర్మాణం చేపట్టాడని మండిపడ్డారు. ఈ రోడ్డు నుంచే సచివాలయం, ఆలయానికి రోడ్డు వెళ ుందని, దీనికి అడ్డంగా ఇంటి నిర్మాణం చేపట్టాడని, వెంటనే ఈ అక్రమ నిర్మాణాన్ని ఆపి అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు గోపాల్‌యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

రెయిన్‌బో పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

రెయిన్‌బో పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

స్థానిక రెయిన్‌బో పాఠశాలలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు శాంటా క్లాజ్, ఏంజెల్ వేషధారణలో హాజరవడంతో పాఠశాల ఆవరణలో క్రిస్మస్ పండుగ వాతావరణం ఏర్పడింది. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాస్టర్ సైమన్ హాజరై విద్యార్థులకు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం జయసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో..

ఓడిసి-3 అంగన్వాడీ కేంద్రంలో బాలల క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ ఎం.ఆశీర్వాదమ్మ చిన్నారులకు క్రిస్మస్ కథను వివరించారు. చిన్నారి పాల్‌జోనాథన్ క్రిస్మస్ తాత వేషధారణలో చిన్నారులను పలకరించి అలరించాడు. అనంతరం చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఆయా పి.బేబీ, టిఎం.రాజకుమారి పాల్గొన్నారు

కనకదాస జయంతిలో పాల్గొన్న నాయకులు

ఘనంగా కనకదాసు జయంతి వేడుకలు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని జక్కలచెరువు గ్రామంలో కురుబ కులస్తులు కనకదాసు జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫొటోకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కనకదాస గొప్పదనాన్ని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కురుమ కులస్తులు రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఎస్పీకి వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నకిలీ పత్రాలు సృష్టించి మా స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని న్యాయం చేయా లని కోరుతూ డి.ఆదినారాయణ, గోకులం రమేష్ సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో విన్నవించారు. బాధితులు మాట్లాడుతూ యనములపల్లి పొలం లోని దుర్గమ్మ గుడి సమీపంలో 2017లో 10.5 సెంట్లను కడియాల గంగన్నతో కొనుగోలు చేశామన్నారు. ఇదే సర్వే నంబర్‌లో పుట్టపర్తికి చెందిన ఓ వ్యక్తి గతంలో 36 సెంట్లు కొని దానిని అమ్ముకున్నా డన్నారు. తిరిగి మేము కొనుగోలు చేసిన స్థలంలో తనకు హక్కు ఉందని దౌర్జన్యంగా నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని అడ్డుకోవాలని ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు ముందు మొరపెట్టుకున్నారు.

ఈదులముష్టూరుచెరువుకు నీరివ్వాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామ చెరువుకు నీళ్లు వదిలి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం సిపిఐ రైతు విభాగం నాయకులు కాటమయ్య ఆధ్వర్యంలో ఆ గ్రామ రైతులు ధర్మవరం వెళ్లి మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతి పత్రం ఇచ్చారు. రైతులు మాట్లాడుతూ నాలుగేళ్లుగా చెరువుకు నీరు వదలకపోవడంతో బోరు బావుల్లో నీరు తగ్గి సాగు చేసిన పంటలు నష్టపోతున్నా మన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఉన్న కొద్దిపాటి నీటితో పంటలు సాగు చేశామని, చెరువుకు నీరు వదిలి పంటలను కాపాడాలని కోరారు. పిఎబిఆర్ నీటిని మన్నీల కాలువ ద్వారానైనా వదలాలని కోరారు.

బకాయి వేతనాల కోసం వినతి

ప్రజాశక్తి-కదిరి టౌన్

బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు మారెప్ప, రవినాయక్ సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని ముత్యాల చెరువు గ్రామ పంచాయతీ కదిరికుంట్లపల్లిలో 18 ఏళ్లుగా ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న 5 నెలల వేతనాలు, ట్యాగ్‌లు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. అలాగే విధి నిర్వహణలో వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను సోమవారం మండలంలోని జగరాజుపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. 15 మంది పదో తరగతి విద్యార్థులకు పిఆర్‌డిఎస్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో మోడల్ పేపర్-2025 మెటీరియల్‌ను అందజేశారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఈశ్వరనారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుమారుడిని తల్లికి అప్పగింత

ప్రజాశక్తి-కదిరి టౌన్

తనకల్లు మండలంలోని రత్నానాయక్‌తండాకు చెందిన యశోదభాయ్ కుమారుడు జగదీష్ నాయక్ పట్టణంలోని వీవర్స్ కాలనీ ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుతుండేవాడు. గత వారం ఎవరికీ చెప్పకుండా హైదరాబాద్‌లోని తన అమ్మమ్మ వద్దకు వెళ్లాడు. దీంతో పోలీసులు స్వచ్ఛంద సంస్థ సహకారంతో హైదరాబాద్‌లో ఉన్న విద్యార్థి జగదీష్‌నాయక్‌కు తీసుకొచ్చి తహశీల్దార్, పోలీసులు, హాస్టల్ వార్డెన్ జయరామిరెడ్డి సమక్షంలో తల్లికి అప్పగించారు.

మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా చంద్ర

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షునిగా బొమ్మయ్యగారి చంద్రన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా మహబూబ్ బాషా, సెక్రటరీలుగా సుబ్రహ్మణ్యం, నరసయ్యగౌడ్‌లను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు చంద్ర మాట్లాడుతూ రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

రైతు బాగుంటేనే దేశం సుభిక్షం

ఎంపి అంబికా లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న రైతులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

రైతు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అనంతపురం పట్టణంలోని రజాక్ ఫంక్షన్ హాల్‌లో రైతు సంఘాలు, రైతు సహాయ సంఘాల ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతులు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. రైతుల కోసం తాను కిసాన్ ట్రైన్‌ను ఏర్పాటు చేసే ప్రయత్నాన్ని కేంద్రస్థాయిలో చేస్తున్నానన్నారు. ఈ మధ్యకాలంలో తాడిపత్రి నుంచి బనానాను రైలు ట్రాన్స్‌పోర్టు ద్వారా విదేశాలకు అధికారులు, నాయకుల సహకారంతో ఎగుమతి చేయించామని చెప్పారు. ఆర్డీటీ మల్లారెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలందరూ ఇంటికి పరిమితమైతే రైతులు మాత్రమే వ్యవసాయం చేసి ప్రజలకు ఆహారాన్ని అందించారని గుర్తు చేశారు. నరేంద్ర స్వరూపా మాట్లాడుతూ తాను ఏర్పాటు చేసినటువంటి రైతు సహకార వేదిక రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. నాగరాజు, బానుజాతో కలిసి రైతులకు న్యాచురల్ ఫార్మింగ్ లో శిక్షణ ఇవ్వడం తమకు సంతోషంగా ఉందన్నారు. విద్యుత్ తీగల వల్ల అనుకోని ప్రమాదంలో మృతిచెందిన రైతుల కుటుంబాలకు 25 వేల రూపాయల చొప్పున హార్టికల్చర్ రైతు సంఘం నాయకులు భాస్కర్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. రెండు రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన 60 మంది రైతులను రైతు రత్న బిరుదుతో పాటు సన్మానించారు. అంతకు ముందు నిర్వాహకులు ఎంపీని సన్మానించారు.